క్లుప్తంగా

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



హుస్నాబాద్‌లో ఏబీవీపీ ర్యాలీ

హుస్నాబాద్‌: విద్యార్థి సమస్యలపై పోరాటం చేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ ఆవిర్భవించిందని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ హుస్నాబాద్‌ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. గాంధీ చౌరస్తా నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సమస్యలే కాకుండా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దేశ పునఃనిర్మాణంలో ఏబీవీపీ భాగస్వామ్యమవుతుందన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏబీవీపీ జెండాను ఎగురవేశారు.

పాలిసెట్‌ రెండో విడత కౌన్సెలింగ్‌



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్‌ కళాశాలలో మంగళవారం ఎంసెట్‌తో పాటు పాలిసెట్‌ రెండో విడత కౌన్సెలింగ్‌ నిర్వహించామని ప్రిన్సిపాల్‌ సూర్యనారాయణ తెలిపారు. ఎంసెట్‌కు 216 మంది, పాలిసెట్‌కు 52 మంది విద్యార్థులు హాజరు కాగా, వారి ఒరిజినల్‌ సర్టిఫికెట్లను పరిశీలించి లాగిన్‌ ఐడీ, పాస్‌వర్డ్‌ అందజేశామన్నారు. విద్యార్థులు కళాశాల కోసం వెబ్‌ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నితిన్‌పవార్‌, మాణిక్యం, శ్రీనివాస్‌, రాజు, సంధ్యారాణి, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫొటోలు పోస్ట్‌ చేయొద్దు

సిద్దిపేటకమాన్‌: సోషల్‌ మీడియాలో ఫ్యామిలీ ఫొటోలు పోస్ట్‌ చేయొద్దని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కొంతమంది తమ ఫ్యామిలీ, పిల్లల ఫొటోలు సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేస్తున్నారని, వీటిని సైబర్‌ నేరగాళ్లు హ్యాక్‌ చేసి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఫొటోలు డీపీగా పెట్టుకోవద్దని, పెట్టుకుంటే ఆ ఫొటోకు లాక్‌ చేయాలన్నారు.

కేంద్ర మంత్రికి వినతి



వినతి పత్రం ఇస్తున్న ఎక్కల దేవి మధు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో రైల్వేస్టేషన్‌ పనులు ప్రారంభించాలని కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసి వినతి పత్రం అందజేసినట్లు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎక్కల దేవి మధు తెలిపారు. కొమురవెల్లిలో రైల్వే స్టేషన్‌ పనులు గత ఎన్నికల ముందు ప్రారంభించారని కానీ, టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభించలేదన్నారు. వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి రైల్వే స్టేషన్‌ పనులు పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరామన్నారు.

స్వచ్ఛ సిద్దిపేట లక్ష్యం

సిద్దిపేటజోన్‌: స్వచ్ఛ సిద్దిపేట లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దామని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ మంజుల రాజనర్స్‌ అన్నారు. మంగళవారం మున్సిపల్‌ కార్యాలయంలో వైస్‌ చైర్మన్‌ కనక రాజు, కమిషనర్‌ ప్రసన్నరాణిలతో కలిసి మూడు స్వచ్ఛ వాహనాలను ప్రారంభించారు. సిద్దిపేట మున్సిపల్‌ పరిధిలోని ఆయా వార్డుల్లో ఇంటింటికి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా సీత్లా పండగ

అక్కన్నపేట(హుస్నాబాద్‌): గిరిజనులు ఏటా జరుపుకునే సీత్లా భవానీ పండగను వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామ పంచాయతీ పరిధి చౌటకుంట తండా గిరిజనులు సీత్లా భవానీ దేవాలయానికి వెళ్లి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరోగ్య పరీక్షల పేరిట భారీ దోపిడీ

- భవన నిర్మాణ కార్మికుల యూనియన్‌ జిల్లా కార్యదర్శి రవికుమార్‌



మాట్లాడుతున్న రవికుమార్‌

సిద్దిపేటఅర్బన్‌: భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షల పేరిట జరుగుతున్న భారీ దోపిడీని అరికట్టాలని, కార్మికుల సొమ్మును దుర్వినియోగం కాకుండా కాపాడాలని భవన నిర్మాణ కార్మికుల యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవి కుమార్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం సిద్దిపేటలోని జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి రాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని భవన ఇతర నిర్మాణ రంగ కార్మికులకు ఆరోగ్య పరీక్ష నిర్వహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2022లో సీఎస్సీ హెల్త్‌కేర్‌ వెల్‌నెస్‌ సర్వీసెస్‌ సంస్థకు కాంట్రాక్ట్‌ ఇచ్చారన్నారు. ఒక్కో కార్మికుడికి ఆరోగ్య పరీక్షల నిర్వహణ నిమిత్తం రూ.3256 చొప్పున ప్రైవేట్‌ సంస్థకు వెల్ఫేర్‌ బోర్డు నుంచి చెల్లించేందుకు ఒప్పందం జరిగిందని తెలిపారు. దీనిని ఆసరాగా చేసుకున్న సంస్థ క్యాంపులు నిర్వహించకపోయినా నిర్వహించినట్లు బోర్డు నిధులు కాజేస్తోందని ఆరోపించారు. వైద్య పరీక్షల పేరిట జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో యూనియన్‌ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌, జిల్లా కమిటీ సభ్యులు బాలయ్య, యాదయ్య, బాలనర్సయ్య, అంతయ్య, రాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సిద్దప్ప వరకవికి ఘన నివాళి



హుస్నాబాద్‌లో సిద్దప్ప వరకవికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

హుస్నాబాద్‌: గోల్కొండ రాజుల ఆస్థాన కవి, రచయిత, తత్వవేత్త శ్రీశ్రీ సిద్దప్ప వరకవి రాజయోగి 121వ జయంతి కార్యక్రమాన్ని కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడారు. సిద్దప్ప కవి రచనలు చేయడంతో పాటు తత్వబోధనలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. చిన్నతనం నుంచే తెలుగు, ఉర్దూ భాషల్లో పట్టుసాధించి ఆయా భాషల్లో రచనలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో కుమ్మర శాలివాహనులు అన్ని రంగాల్లో రాణించి సామాజికంగా అభివృద్ధి చెందాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుస్నాబాద్‌ పట్టణ కుమ్మర శాలివాహనుల సంఘం అధ్యక్షుడు బెక్కంటి భీమయ్య, నాయకులు పాల్గొన్నారు.

గుండారెడ్డిపల్లి గ్రామంలో ..

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ తొలికవుల్లో ప్రథముడు సిద్దప్ప వరకవి 121 జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిద్దప్ప వరకవి ఆశ్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిద్దప్ప వరకవి కుమారుడు మాణిక్యలింగం, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు చెట్లే ఆధారం

- మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ రజిత



హుస్నాబాద్‌ నేతాజీ నగర్‌లో మొక్క నాటుతున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రజిత

హుస్నాబాద్‌: మానవాళి మనుగడకు చెట్లే ఆధారమని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఆకుల రజిత అన్నారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని 1వ వార్డు నేతాజీ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి ఏపుగా పెరిగేలా బాధ్యత తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా హరిత తెలంగాణ కోసం కృషి చేస్తోందని, అందులో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ కొంకట నళినీదేవి, కో ఆప్షన్‌ సభ్యుడు అయూబ్‌, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడులు



బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మర్కూక్‌(గజ్వేల్‌): అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌ షాపుపై టాస్క్‌ఫోర్స్‌ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గణేశ్‌పల్లి గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్‌ తన కిరాణ దుకాణంలో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్‌ పోలీసు అధికారులు, మర్కూక్‌ పోలీసులు కిరాణ దుకాణంపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 128 లీటర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సదరు యజమానిపై కేసు నమోదు చేయడం జరిగిందని, జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్‌ రైస్‌ అక్రమ రవాణా చేసి నిల్వ ఉంచినా, గుట్కాలు కలిగి ఉన్నా అలాగే బెల్ట్‌ షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధుల నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్‌ నాయకులు

దుబ్బాకటౌన్‌: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ ఆత్మహత్యకు కారకులైన సీఐ జితేందర్‌ రెడ్డి, సహకరించిన కానిస్టేబుళ్లను చట్టరీత్యా శిక్షించాలని దుబ్బాక అంబేడ్కర్‌ సంఘం అధ్యక్షుడు కాల్వ లింగం, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ కాల్వ నరేష్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం దుబ్బాకలో వారు మాట్లాడారు. ఎస్‌ఐ ఆత్మహత్యకు కారకులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, వారిని విధుల నుంచి తొలగించాలన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ ఆత్మహత్యకు కారకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలను అమలు చేసే పోలీసు శాఖలోనే కులవివక్ష ఉండటం దురదృష్టకరమన్నారు. ఎస్‌ఐ ఆత్మహత్యకు కారకులైనవారిని విధుల నుంచి తొలగించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎస్‌ఐ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కర్రోల్ల ఎల్లయ్య, తాడూరి మల్లేశం,కాసర్ల రాజేశ్వర్‌ పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలకు బాలామృతం

- ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రాణి



గజ్వేల్‌లో చిన్నారుల ఎత్తును పరిశీలిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వర్గల్‌(గజ్వేల్‌): చిన్నారుల ఎదుగుదలకు పోషక సంపన్నమైన బాలామృతం ప్లస్‌ దోహదపడుతుందని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రాణి అన్నారు. మంగళవారం మండలంలోని సింగాయపల్లిలో గ్రోత్‌ మేళా నిర్వహించారు. 5 ఏళ్ల లోపు 68 మంది చిన్నారుల బరువు, ఎత్తు కొలతలు పరిశీలించి నమోదు చేశారు. పిల్లల ఎత్తుకు తగిన బరువు ఉంటేనే ఆరోగ్యంగా ఎదుగుతారని, తేడా గుర్తించిన వారికి బాలామృతం ప్లస్‌ సిఫార్స్‌ చేశామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్‌ కిరణ్‌పాండియా, అంగన్‌వాడీ టీచర్‌ హంస, ఐకేపీ సీసీ, తల్లులు పాల్గొన్నారు.

రిమ్మనగూడలో..

గజ్వేల్‌: గజ్వేల్‌ మండలం రిమ్మనగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రోత్‌ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు కొలతలు, బరువును పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజినీ, పద్మ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి

మిరుదొడ్డి(దుబ్బాక): అంగన్‌ వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంపై పిల్లల తల్లులకు అవగాహన ఉండాలని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడు ఫహీం అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం గ్రోత్‌ మేళా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, పిల్లల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దాచారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో..

బెజ్జంకి (సిద్దిపేట): విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ నాగరాణి అన్నారు. మండలంలోని దాచారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం గ్రోత్‌ మేళా నిర్వహించారు. చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. బరువు తక్కువ వున్న వారిని గుర్తించి పౌష్టికాహారాన్ని అందజేస్తామన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌ స్తంభాలు



కాచపూర్‌ గ్రామ శివారులో పక్కకు ఒరిగిన స్తంభం

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): మండలంలోని కాచపూర్‌ గ్రామ శివారులో విద్యుత్‌ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామం నుంచి హుస్నాబాద్‌ వెళ్లే రోడ్డు పక్కన పొలాల్లో ఓ పక్కకు ఒరిగిపోయి ఉండటంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌ వైర్లు ఎప్పుడు తెగిపడతాయోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని పొలం పనులు చేస్తున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆఫ్‌ మారథాన్‌లో భాగస్వాములవ్వాలి



వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న అడిషనల్‌ డీసీపీ రామచందర్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): 28వ తేదీన చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌ శివారు రంగనాయక సాగర్‌ రిజర్వాయర్‌ కట్టపై నిర్వహించే ఆఫ్‌ మారథాన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అడిషనల్‌ డీసీపీ రామచందర్‌రావు పిలుపు ఇచ్చారు. మంగళవారం ఆఫ్‌ మారథాన్‌ 2వ ఎడిషన్‌ వాల్‌ పోస్టర్లను సీఏఆర్‌ హెడ్‌ క్వార్టర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్‌, ప్రసాద్‌, సిద్దిపేట రన్నర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బాపురెడ్డి, కార్యవర్గ సభ్యులు రాజు, ఎస్‌ఐలు వెంకటరమణ, నిరంజన్‌, అంజయ్య పాల్గొన్నారు.

వీరికి వీడ్కోలు.. వారికి స్వాగతం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ మండలం మజీద్‌పల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల బదిలీ సందర్భంగా హెచ్‌ఎం రమేశ్‌ ఆధ్వర్యంలో మంగళవారం వీడ్కోలు, స్వాగత సమావేశం నిర్వహించారు. స్కూల్‌ నుంచి ఉపాధ్యాయులు హరిబాబు, కృష్ణవేణి, స్వామి, సరస్వతి బదిలీపై వెళ్లారు. వారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. బదిలీపై వచ్చిన శ్రీవాణి, స్వరూపరాణి, దౌలతమన్‌, శివప్రసాద్‌, చంద్రశేఖర్‌రెడ్డిలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌ లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు..

గజ్వేల్‌రూరల్‌: విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని, వారి సేవలు వెలకట్టలేనివని మండల పరిధిలోని అహ్మదీపూర్‌ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయులు రామకృష్ణ, నరేష్‌కుమార్‌, పద్మ, విజయలక్ష్మీ, జావెదున్న బేగం బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగుణాకర్‌, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఎంపీ ప్రత్యేక పూజలు



మార్కండేయ ఆలయంలో ఎంపీని సన్మానిస్తున్న పద్మశాలి సమాజం సభ్యులు

దుబ్బాక: పట్టణంలోని బాలాజీ ఆలయాన్ని ఎంపీ మాధవనేని రఘునందన్‌ రావు సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీగా గెలిచిన తర్వాత తొలిసారి ఆలయానికి రావడంతో ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అలాగే మార్కండేయ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆయనను పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొగుట(దుబ్బాక): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్‌ కుక్‌ పోస్టుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈఓ సత్తు యాదవరెడ్డి మంగళవారం తెలిపారు. అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 300 మందికి భోజనం తయారు చేసే అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 10 నుంచి 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు ఆధార్‌ కార్డు, రెండు పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలు, అనుభవం ధ్రువీకరణ పత్రాలు జతపరిచి కేజీబీవీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలోపు అందజేయాలన్నారు.


ఫలితాల్లో టాప్‌.. సాయి జీడీఆర్‌ స్కూల్‌

- బోధనలో 33 ఏళ్ల అనుభవం
- ఉత్తమ ఫలితాలకు చిరునామా
- డైరెక్టర్‌ సోమేశ్వర్‌ రెడ్డి

గజ్వేల్‌: అత్యుత్తమ బోధన, అదే స్థాయి ఫలితాలతో గజ్వేల్‌ సాయి జీడీఆర్‌ హైస్కూల్‌ సత్తా చాటుతోంది. 33 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో తనదైన ముద్ర వేస్తూ విద్యా వికాసానికి చిరునామాగా మారింది. ఉత్తమ ఫలితాలతో ఏటా అగ్రస్థానం నిలుస్తోంది. జీడీఆర్‌ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ హైస్కూల్‌తో పాటు విద్యార్థులకు హాస్టల్‌ వసతి ఉందని ప్రిన్సిపాల్‌ తెలిపారు. సీబీఎస్‌ఈ, ఇంటిగ్రేటెడ్‌ సిలబస్‌, ఐఐటీ, ఇంటర్నేషనల్‌, బోధన విధానంలో ప్రత్యేకంగా కోచింగ్‌ ఇస్తున్నామన్నారు. డిజిటల్‌ తరగతులు, ప్రత్యేకంగా ల్యాబ్‌లు, విశాలమైనా క్రీడా మైదానం, రవాణా సదుపాయం ఉందన్నారు. చదువుతోపాటు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందింపజేసేందుకు మ్యూజిక్‌, కరాటే, క్లాసికల్‌, వెస్ట్రన్‌ డ్యాన్స్‌, యోగా తరగతులకు శిక్షణ ఉంటుందన్నారు.

ప్రత్యేకతలు

- టెన్త్‌లో 10 జీపీఏతో పాటు 100 శాతం ఉత్తీర్ణత.
- విద్యారంగంలో 33 సంవత్సరాల అనుభవం.
- పచ్చదనం, విశాలమైన ఆటస్థలం, చక్కని మౌలిక సదుపాయాలతో ఆహ్లాదకర వాతావరణం.
- అన్ని తరగతులలో డిజిటల్‌ క్లాసులు.
- అటల్‌ టింకరింగ్‌ ల్యాబ్‌, కెమిస్ట్రీ ల్యాబ్‌, కంప్యూటర్‌ ల్యాబ్‌ సదుపాయం.
- సంగీతం, ఆర్ట్‌, క్రాఫ్ట్‌, కరాటే, శాస్త్రీయ నత్యం, పాశ్చాత్య నృత్యం, యోగా తరగతులు.
- చిన్నారుల కోసం రైలు నేపథ్య బ్లాక్‌.



సోమేశ్వర్‌ రెడ్డి, డైరెక్టర్‌



ఫేస్‌బుక్‌ పోస్ట్‌పై బీఆర్‌ఎస్‌ నేత ఫిర్యాదు

మద్దూరు(హుస్నాబాద్‌): ఫేస్‌బుక్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ ఫొటోలను మార్ఫింగ్‌ చేసి, అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ పార్టీ యూత్‌ ధూళ్మిట్ట మండల అధ్యక్షులు బడుగు సాయిలు అన్నారు. ఈ మేరకు మంగళవారం మద్దూరు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో ఆదిత్య చౌదరి రాయుడు కేసీఆర్‌ మద్యం సీసాలతో ఉన్న విధంగా ఫొటోలను మార్ఫింగ్‌ చేసి వీడియోలు రూపొందించి ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సంక్షిప్త వార్తలు

◆ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీ, వెంటనే ఆ హామీలను అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జంకి తహసీల్దార్‌ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్‌ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభమైనందున రైతులకు రుణమాఫీ చేసి, రైతుబంధు జమ చేయాలన్నారు.

◆ సోషల్‌ మీడియాకు దూరంగా ఉండాలి

నంగునూరు(సిద్దిపేట): సోషల్‌ మీడియాకు విద్యార్థులు, యువత దూరంగా ఉండి చక్కగా చదువుకోవాలని సిద్దిపేట రూరల్‌ సీఐ శ్రీను సూచించారు. సిద్దిపేట షీ టీమ్‌, భరోసా సెంటర్‌, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నర్మేట ఉన్నత పాఠశాలలో నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్‌, ఈవ్‌టీజింగ్‌, పోక్సో, షీటీమ్‌, సైబర్‌ నేరాలు, మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లు, మొబైల్‌ ఫోన్‌కు బానిస కావొద్దన్నారు. నూతన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు, షీటీమ్‌ సభ్యులు కిషన్‌, మమత, వీణాకుమారి, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

◆ ఉచిత దంత వైద్య శిబిరం

నంగునూరు(సిద్దిపేట): మారుమూల ప్రజల సౌకర్యం కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ సర్పంచ్‌ భూక్య భిక్షపతి నాయక్‌ అన్నారు. జేపీ తండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సిద్దిపేటకు చెందిన ఓ ప్రైవేట్‌ ఆసుపత్రి యాజమాన్యం దంతవైద్య శిబిరం ఏర్పాటు చేసింది. శిబిరంలో గ్రామస్తులు, విద్యార్థులకు డాక్టర్‌ శ్రీనివాస్‌ దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రం, శోభారాణి పాల్గొన్నారు.

◆ ఆర్యవైశ్య పట్టణ కమిటీ నియామకం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ నియమిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ తెలిపారు. మంగళవారం వైశ్య భవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తడ్క లింగం, గౌరవ అధ్యక్షుడు మంచాల ఆంజనేయులు సమక్షంలో పట్టణ కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా ఉప్పల నాగరాజు, కోశాధికారిగా తేరాల శ్రీనివాస్‌, పీఆర్వోగా శేరి బాలనారాయణ, ఉపాధ్యక్షులుగా అయిత రవీందర్‌, పిన్న వీరమల్లయ్య, యాంసాని లక్ష్మణ్‌, యాంసాని బాలనారాయణ, సహాయ కార్యదర్శులుగా పెద్ది రమేష్‌, మంకాల రాజు, పుసనాల వీరేశం, గందె నర్సయ్య, కార్యవర్గసభ్యులుగా పిన్న రాజమౌళి, మంచాల నారాయణ, పడకంటి ఉమాపతి, కందుకూరి చంద్రశేఖర్‌, అయిత శంకర్‌, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తోట పద్మ, యువజన విభాగం అధ్యక్షుడిగా ఓరుగంటి శ్రీకాంత్‌ను నియమించినట్లు తెలిపారు.

◆ సకాలంలో బిల్లులు చెల్లించాలి

ములుగు(గజ్వేల్‌): సకాలంలో తమకు బిల్లులు అందక ఇబ్బందులుపడుతున్నామని ములుగు విజయ డెయిరీ ఎదుట పాడి రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. 15 రోజులకు ఒకసారి ప్రభుత్వం తమకు బిల్లులు చెల్లించేదని, ప్రస్తుతం కొన్ని నెలలుగా అందడం లేదని ఆరోపించారు. సకాలంలో బిల్లులు అందేలా చూడాలని కోరారు.

◆ గీత కార్మికుడికి గాయాలు

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండలం పొట్లపల్లి గ్రామానికి చెంది బొమ్మగాని వెంకటస్వామి మంగళవారం కల్లు తీసేందుకు చెట్టు ఎక్కాడు. కల్లు గీసే క్రమంలో చెట్టుపై నుంచి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచన మేరకు నిమ్స్‌కు తరలించారు.

◆ ఇసుక డంప్‌ సీజ్‌

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండలంలోని మల్లంపల్లి శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను పోలీసులు, టాస్క్‌ఫోర్స్‌ అధికారులు మంగళవారం సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ కుమారస్వామి మాట్లాడుతూ 40 టన్నుల ఇసుకను గ్రామానికి చెందిన రంగారెడ్డి స్థలంలో డంప్‌ చేశారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీల్లో ఇసుకను నిల్వ చేసినట్లు గుర్తించి సీజ్‌ చేశామన్నారు.

◆ సైబర్‌ నేరాలపై అవగాహన

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): మత్తు పదార్థాలతో విద్యార్థుల భవిష్యత్‌ ప్రశ్నార్థకంగా మారుతుందని, వాటి జోలికి పోవొద్దని సిద్దిపేట టూ టౌన్‌ ఇన్‌స్పెక్టర్‌ ఉపేందర్‌ అన్నారు. మంగళవారం ఓ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.